RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 5 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:232 | సెప్టెంబర్ 27, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



## పార్కులు, సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం మరింత విస్తరించాలి

బల్దియా కమిషనర్ టి. వెంకన్న

2లో




నా కూతురికి రెక్కలు ఇస్తాను...
ఎగరనిస్తాను..!
నువ్వు పుట్టిన రోజు
ఇంట్లోకి మరో వ్యక్తి రాలేదు..
ఒక కొత్త ప్రపంచం అడుగుపెట్టింది.
నీ నవ్వులో మన ఇంటి ఆనందం ఉంది.
నీ మాటల్లో మా భవిష్యత్తుపై
నమ్మకం ఉంది.
నీ విజయాల్లో మా కలలన్నీ కనిపిస్తాయి.
నిన్ను నేను ఒక బాధ్యతగా
ఎప్పుడూ చూడను...
నువ్వు మా జీవితానికి వచ్చిన
ఒక అందమైన అవకాశం.

నీకు ఆస్తి ఇవ్వడం కంటే...
ఆత్మవిశ్వాసం ఇవ్వాలని కోరుకుంటున్నాను.
నీ కోసం ప్రతి నిర్ణయం నేను తీసుకోవడం కాదు...
నీ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు
నువ్వే తీసుకునేంత ధైర్యాన్ని నీలో
నింపాలని కోరుకుంటున్నాను.

నిన్ను కాపాడటం మాత్రమే నా బాధ్యత కాదు...
నిన్ను నువ్వు కాపాడుకోగలిగేంత ధైర్యవంతురాలిగా
తీర్చిదిద్దడం నా బాధ్యత.

'నువ్వు అమ్మాయివి... ఇలా ఉండాలి' అని నీ కలలకు హద్దులు పెట్టను.బదులుగా.. 'నువ్వు ఏం కావాలనుకుంటున్నావో చెప్పు...నీ కలల కోసం మేమున్నాం' అని చెబుతాను.

## నా కూతురికి రెక్కలు ఇస్తాను...
## ఎగరనిస్తాను..!



నువ్వు వైద్యురాలవ్వాలనుకున్నా...
శాస్త్రవేత్త కావాలనుకున్నా...
క్రీడాకారిణి కావాలనుకున్నా...
వ్యాపారవేత్త కావాలనుకున్నా...
కళాకారిణి కావాలనుకున్నా...
లేదా నీకు నచ్చిన మార్గంలో నడవాలనుకున్నా...

నీ కల నీదే..
ఆ కలను గౌరవించడం మా బాధ్యత.
జీవితంలో ఎప్పుడైనా ఓడిపోయినా భయపడకు.
పడిపోయినా బాధపడకు.
మళ్లీ లేచి నిలబడే ధైర్యం నీలో ఉంటే చాలు.
ఎందుకంటే...
కూతురికి ఇచ్చే గొప్ప బహుమతి ఆస్తి కాదు..
ఆత్మవిశ్వాసం.
కూతురికి ఇచ్చే గొప్ప భద్రత
ఆంక్షలు కాదు.. అవగాహన.
కూతురికి ఇచ్చే గొప్ప బలం భయం కాదు... ధైర్యం

**నా కూతురా...**

నీ రెక్కలు కత్తిరించి నిన్ను కాపాడాలని
నేను అనుకోను.
ఆ రెక్కలకు బలం ఇచ్చి... నీకు నచ్చిన ఆకాశంలో
నువ్వు ఎగరాలని కోరుకుంటాను.
నువ్వు ఎంత ఎత్తుకు ఎదిగినా...
నీ వెనుక నిలబడి గర్వంగా చూసే
తల్లిదండ్రులుగా మేముంటాం.


**నువ్వు మా కూతురివి మాత్రమే కాదు...**
**మా గర్వం, మా ఆనందం, మా భవిష్యత్తు**

#Happy Daughter's Day

కూతురికి ప్రేమతో...
తండ్రి
లింగబత్తిని కృష్ణ
9701923260

ప్రపంచంలోని ప్రతి కూతురికి... హృదయపూర్వక డాటర్స్ డే శుభాకాంక్షలు!


# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఇష్టారాజ్యం



## గ్రామసభ నిర్వహించకుండానే లబ్ధిదారుల ఎంపికకు ఏర్పాట్లు

### ఆరోపిస్తున్న దరఖాస్తుదారులు

### లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్

**వేద న్యూస్, రుద్రూర్**

రుద్రూర్ గ్రామంలో నిరుపేదలకు పంపిణీ చేయనున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో నిర్మించిన 150 ఇళ్ల పంపిణీ కోసం 480 మంది దరఖాస్తు చేసుకోగా.. 287 మందిని అర్హులుగా గుర్తించి తహసీల్దార్ కార్యాలయ నోటీసు బోర్డులో జాబితాను ప్రదర్శించారు. అయితే, అధికారికంగా ప్రకటించిన జాబితాకు భిన్నంగా మరో జాబితా సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికను గ్రామసభ ద్వారా పారదర్శకంగా నిర్వహించాల్సి ఉండగా.. గ్రామసభ నిర్వహించకుండానే ఎంపిక ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. అర్హులైన వారికి ఇళ్లు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్‌ను కలిసి గ్రామసభ నిర్వహించి లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఏకపక్షంగా లబ్ధిదారుల ఎంపిక చేపడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. నిరుపేదలకు అందాల్సిన ఇళ్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.



## ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, ఆర్డీవో సుమ, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఆర్అండ్బీ ఈఈ రాజేందర్, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి నటరాజ్, ఇరిగేషన్ డీఈ సురేష్ బాబు, డీఈ మధుసూదన్, ఖిలా వరంగల్ నేషనల్ హైవే డీఈ అమీర్ పాషా తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## గ్రామీణాభివృద్ధికి పక్కా ప్రణాళిక

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

2లో

వేద న్యూస్

ఆదివారం సెప్టెంబర్ 27, 2026

# గ్రామీణాభివృద్ధికి పక్కా ప్రణాళిక

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేయాలి
గ్రామసభల తీర్మానాల ఆధారంగా అభివృద్ధి పనులు
భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు
భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**వేద న్యూస్, భూపాలపల్లి ప్రతినిధి**

గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టడంతో పాటు గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని సూచించారు. డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులను కూడా స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను గ్రామసభల ద్వారా తీర్మానాలు చేయాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నందున ఆ ప్రాతిపదికన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీరు,



విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు జారీ చేసి కూలీల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ, వీఓ భవనాలు, పాఠశాలలకు ప్రహరీ నిర్మాణంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే ప్రత్యేక గ్రామసభల్లో గ్రామాభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించి తీర్మానాలు ఆమోదించాలని తెలిపారు. ప్రతి గ్రామానికి అవసరమైన పనులపై ముందుగానే ఇన్వెంటరీ సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను పక్కాగా సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీఓ బాలకృష్ణ, డీఎంఓ కౌసల్య దేవి, డీపీఓ శ్రీలత, ఎంపీడీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సంస్కరణల రూపశిల్పికి నివాళి

విప్రో కూడలిలో మన్మోహన్ సింగ్ విగ్రహం
ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో కూడలిలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశం గర్వించదగ్గ మహనీయుడని అన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన దేశానికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన సమయంలో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్ సింగ్ కొత్త దిశను చూపారని సీఎం పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం వంటి నిర్ణయాలు దేశ సామాజిక అభివృద్ధికి దోహదపడ్డాయని అన్నారు. హైదరాబాద్ ఆర్థిక ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ సేవలకు గుర్తింపుగా ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని ప్రధానిని కోరుతున్నట్లు సీఎం తెలిపారు. అలాగే దేశ రాజధానిలో ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విగ్రహావిష్కరణ తనకు గర్వకారణమని పేర్కొంటూ మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో సీడీపీవో

రూ.63 వేల లంచం తీసుకుంటూ
పట్టుబడ్డ అవినీతి అధికారిని
అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల్లో అనుకూలంగా వ్యవహరించేందుకు డిమాండ్

**వేద న్యూస్, జగిత్యాల**



జగిత్యాల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన దాడిలో మెట్‌పల్లి శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి దారోజు పద్మ రూ.63 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అధికారిక విధుల్లో అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా శనివారం కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణ, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయకుండా ఉండేందుకు అధికారి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మొత్తం 21 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి నెలకు రూ.1,000 చొప్పున వసూలు చేయాలని కోరినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలలకు సంబంధించి మొత్తం రూ.63 వేలుగా లంచం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్ని చర్యలు చేపట్టారు. కార్యాలయ ఆవరణ వెలుపల ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం స్వీకరిస్తుండగా సీడీపీవోను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. విధుల్లో అనుకూలత చూపేందుకు లంచం డిమాండ్ చేయడం, స్వీకరించడం చట్టవిరుద్ధమని అవినీతి నిరోధక శాఖ పేర్కొంది. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. పట్టుబడిన అధికారిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే అవినీతి నిరోధక శాఖ ఉచిత సహాయ సంఖ్య 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఆమ్రాబాద్‌లో రాత్రి వాహనాల నిషేధం

వన్యప్రాణుల రక్షణకు కఠిన చర్యలు
రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు ఆంక్షలు

**వేద న్యూస్, నాగర్‌కర్నూల్**

వన్యప్రాణుల సంరక్షణతో పాటు రహదారులపై వాహనాల రాకపోకల కారణంగా జంతువులకు ఎదురవుతున్న ప్రమాదాలను నివారించేందుకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో రాత్రివేళ వాహనాల రాకపోకలపై అటవీ శాఖ కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో వన్యప్రాణుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. టైగర్ రిజర్వ్‌లలోని కోర్ ప్రాంతాలు, క్రిటికల్ టైగర్ హ్యాబిటాట్ ప్రాంతాల మీదుగా వెళ్లే రహదారులపై రాత్రి సమయంలో వాహనాల రాకపోకలను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలను మినహాయించి ఇతర వాహనాలను అనుమతించవద్దని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల అమలులో భాగంగా ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అటవీ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సాధారణ వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు. ఈ సమయంలో అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, ఇతర అత్యవసర విధుల్లో ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి కల్పించనున్నారు.

## పార్కులు, సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం మరింత విస్తరించాలి

నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు
మిస్ట్ బస్‌స్టాప్ పనుల నిర్వహణను పరిశీలించిన బల్దియా కమిషనర్ టి. వెంకన్న

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**



పార్కులు, సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం మరింత విస్తరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగరంలో హార్టికల్చర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పార్కులు, సెంట్రల్ మీడియన్లు, గ్రీనరీ అభివృద్ధి పనులను శనివారం కమిషనర్ హార్టికల్చర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాజీపేట–సోమిడి సెంట్రల్ మీడియన్, ఎక్సైజ్ కాలనీలోని కనకదుర్గ పార్క్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతాల్లో పచ్చదనం, సుందరీకరణ, మొక్కల సంరక్షణ, నిర్వహణ తీరును పరిశీలించారు. అదే విధంగా వరంగల్ కోట చెరువు బండ్ వద్ద చేపట్టిన ప్లాంటేషన్ పనులను, లేబర్ కాలనీలోని టీఆర్టీ పార్కులో నూతనంగా చేపట్టిన గ్రీనరీ, సుందరీకరణ పనులను పరిశీలించారు. పార్కులు, మీడియన్లలో నాటిన మొక్కలను నాణ్యతతో సంరక్షిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మొక్కల పెరుగుదలకు అవసరమైన నీటి సరఫరా, నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులకు సంబంధించి అవసరమైన వివరాలను పరిశీలించి, పనుల నాణ్యతకు అనుగుణంగానే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగర సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేస్తున్న ప్రతి గ్రీన్ స్పేస్ ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ హనుమకొండ పబ్లిక్ గార్డెన్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన మిస్ట్ బస్‌స్టాప్‌లను పరిశీలించారు. వేసవి తాపం నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగేలా మిస్ట్ బస్‌స్టాప్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చాకలి ఐలమ్మ జయంతికి సంబంధించిన ఏర్పాట్లను కూడా కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అధికారి ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

పనుల్లో జాప్యం లేకుండా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి
అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించిన ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ సాయపు రెడ్డి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ సాయపు రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగరంలో పర్యటించిన ఆయన జిడబ్ల్యూఎంసీ, కుడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న, ప్రతిపాదిత వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హనుమకొండలోని కాజీపేట కూడలిలో ప్రతిపాదించిన జంక్షన్ అభివృద్ధి పనుల ప్రణాళిక, మౌలిక వసతులు, ట్రాఫిక్ నిర్వహణ అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నవడ్డేపల్లి చెరువు పునరుద్ధరణ పనులు, బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్మాణంలో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, వరంగల్ బస్‌స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఖిలా వరంగల్ మోటు అభివృద్ధి, స్తంభంపల్లి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉర్సుగుట్ట చెరువు పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి, ఎస్టీపీ పనులను పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం బల్దియా కమిషనర్ టి. వెంకన్నతో కలిసి కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నగర అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. కొనసాగుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టుల ప్రణాళిక, పనుల ప్రస్తుత దశ, కాలపరిమితి, అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే మౌలిక వసతుల పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సాయపు రెడ్డి సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈలు రవికుమార్, సంజయ్ కుమార్, డీఈలు, ఏఈలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తాం

ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, పడకల కొరతను పరిష్కరించాలి
ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తాం
ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల పరిస్థితిపై కల్వకుంట్ల కవిత ఆందోళన

**వేద న్యూస్, హైదరాబాద్**



రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల పరిస్థితిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య వంటి మౌలిక రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన కవిత, శిశు మరణాలకు సంబంధించిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో లోపాలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకలు, వైద్యులు, సిబ్బంది కొరతను పరిష్కరించాలని అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనల ప్రకారం నిర్దిష్ట శాతం ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా రంగంపై కూడా కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, ముఖ్యంగా బాలికలకు మరుగుదొడ్లు, పరిశుభ్రత సదుపాయాలు మెరుగుపరచాలని అన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిపై తమ పార్టీ ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతుందని కవిత తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లాల వారీగా పర్యటించి సమస్యలను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తారని చెప్పారు.

## పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**వేద న్యూస్, జనగామ**

రాష్ట్రంలో పూరిగుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2 వేల ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. పూరిగుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిగుడిసెల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్రత్యేక సాయం అందిస్తున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత విద్యా సంస్థలను నిర్మిస్తున్నామని తెలిపారు.

వేద న్యూస్



# గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం

**వేద న్యూస్, చీర్యాల :**

గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో పాటు చీర్యాల, పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య స్క్రీనింగ్, వైద్య సంప్రదింపులు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్డియాలజీ, గైనకాలజీ, దంత వైద్యం, నేత్ర వైద్యం, క్యాన్సర్ స్క్రీనింగ్, పీడియాట్రిక్స్, ఫిజియోథెరపీ, జనరల్ ఫిజీషియన్ విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు, తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు ఇచ్చారు. నివారణాత్మక ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యమని




నిర్వాహకులు తెలిపారు. చీర్యాల, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. "ఆరోగ్యకరమైన సమాజం బలమైన భవిష్యత్తు" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో వైద్య సేవలను అందించడమే కాకుండా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

# మహాదేవపూర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**వేద న్యూస్, మహాదేవపూర్:**

తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మహాదేవపూర్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజాబాపు, మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా బాను, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ పాల్గొన్నారు. గ్రామ పెద్దలు బుర్ర శివరాజు, చల్లూరి సదానందం, కోట సమ్మయ్య, పిడుగు బాపు, నాగేందర్, మంచినీళ్ల దుర్గయ్య, కన్నెబోయిన ఐలయ్య, కాల్వపల్లి రాజశేఖర్, దాగం సంతోష్ పాల్గొని ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షుడు చెన్నూరు వెంకటయ్య, మహాదేవపూర్ మండల రజక సంఘం అధ్యక్షుడు చెన్నూరు శివ, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి నరేష్, ఉపాధ్యక్షులు పున్న రాజు, చెన్నూరి రాజు, నస్పూర్ మహేష్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి

## – ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజాసంఘాల డిమాండ్

**వేద న్యూస్, నల్లబెల్లి:**

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ రాజీనామా చేయాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. నల్లబెల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం నియామక విధానంలో మార్పులు చేసి కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా వ్యవహరించే పరిస్థితులు కల్పించిందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలపై అనుమానాలు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓటర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వీడియో, సీసీటీవీ రికార్డులను నిబంధనల మేరకు పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని కాపాడేలా నియామక ప్రక్రియలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజాతంత్ర, అభ్యుదయవాదులు



పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కుమారస్వామి పిలుపునిచ్చారు. సమావేశంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కందికొండ రాములు, మాజీ సర్పంచ్ మామిళ్ల మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, నాగలి ప్రకాష్ పాల్గొన్నారు.

# నెక్కొండలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**వేద న్యూస్, నెక్కొండ:**

తెలంగాణ రైతాంగ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నెక్కొండలో ఘనంగా నిర్వహించారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహ దాత చల్ల రగోతం రెడ్డి, స్టీల్ రైలింగ్ దాత తాటిపెల్లి శివకుమార్‌తో పాటు రజక కుల పెద్దలు రామారపు వీరస్వామి, రామారపు లక్ష్మీనారాయణ, రామారపు భద్రయ్య, రామారపు శిరీష రాము, రామారపు విజయ్, పొట్లపల్లి వీరస్వామి, రామారపు రఘు, బండి రామస్వామి, బొడ్డుపెల్లి శ్రీశైలం, పైండ్ల వీరయ్య, బండి నరేష్, గాదె భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి



**వేద న్యూస్, మందమర్రి:**

తెలంగాణ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం మందమర్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ ప్రాంతంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. అణిచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆమె ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాత బస్టాండ్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు కనుకయ్య, రజక సంఘం నాయకులు రాంచందర్, చందర్, పాపయ్య, హనుమంతు, గుడికందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దులపల్లిలో గ్రామసభ

## – గ్రామాభివృద్ధి పనుల గుర్తింపుపై చర్చ

**వేద న్యూస్, మహాదేవపూర్:**



మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీలో శనివారం ప్లానింగ్ ప్రక్రియలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామ అవసరాలను గుర్తించి అభి వృద్ధి పనులకు ప్రణాళిక రూపొం దించే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. పథకం ద్వారా గ్రామపంచాయతీ భవనం, డ్రైన్లు, మట్టి రోడ్లు, డ్రైనేజ్, సోక్ పిట్లు, పశువుల పాకలు, మేకల పాకలు, ఫారం పాండ్ తదితర పనులను గుర్తించారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులను ప్రాధాన్య క్రమంలో చేపట్టేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యురాలు శ్రీజ, పంచాయతీ కార్యదర్శి స్వాతి, టెక్నికల్ అసిస్టెంట్ మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు.

# చాకలి ఐలమ్మ రైతాంగ పోరాట మాతృమూర్తి

## – ఎమ్మెల్యే జీఎస్సార్

**వేద న్యూస్, శాయంపేట:**



చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు శాయంపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాం పాలనలో దోపిడీ, దొరల దౌర్జన్యాలు, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిదాతగా నిలిచారని అన్నారు. భూమి హక్కుతో పాటు ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆమె సాగించిన పోరాటం చారిత్రకమైందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. మహిళా నాయకత్వానికి, అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఆమె జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఐలమ్మ జయంతి వేడుకల ద్వారా తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తిని, సామాజిక సమానత్వం, మహిళా సాధికారత సందేశాన్ని నూతన తరాలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**వేద న్యూస్, నల్లబెల్లి:**



వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నల్లబెల్లి మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూస్వాముల దోపిడీ, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, సర్పంచ్ నాగెల్లి జ్యోతి, రజక సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ ఓపెన్ డేకు సిటీ కాలేజీ విద్యార్థులు

## – శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముచ్చటించిన విద్యార్థులు




**వేద న్యూస్, హైదరాబాద్:**

సిటీ కాలేజీ ఫిజిక్స్ విభాగం విద్యార్థులు హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్ఐ)లో నిర్వహించిన ఓపెన్ డే, సీఎస్ఐఆర్ స్థాపన దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడి భూకంపాలు, జియోడైనమిక్స్, సహజ వనరుల అన్వేషణ, భూభౌతిక పరిశోధనలపై అవగాహన పొందారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కుష్మిత, డాక్టర్ విజయరాఘవన్‌లతో విద్యార్థులు సంభాషించి ఆధునిక పరిశోధనా విధానాలు, వాటి ప్రాధాన్యతను తెలుసుకున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను పరిశోధనా సంస్థలో ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ పరిశోధనపై ఆసక్తి పెరిగిందని అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో సిటీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ జె. పందరి, ఎం. నవీన్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులను ప్రొఫెసర్ నైనా వినోదిని, ఇతర విభాగాల ఆచార్యులు అభినందించారు.

వేద న్యూస్

ఆదివారం సెప్టెంబర్ 27, 2026

## ఆర్టీసీ ప్రయాణికులకు మొబైల్ సేవలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



ఆర్టీసీ ప్రయాణికులకు బస్సు సమయాలు, రూట్ వివరాలను అందించేందుకు వరంగల్ బస్టాండ్‌లో ప్రత్యేక మొబైల్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు హన్మకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. 9959226057 నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వరంగల్ బస్టాండ్ నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులతో పాటు సిటీ బస్సుల వివరాలను కూడా ఈ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో రూట్ నంబర్లు 1, 1బి, 3, 11 బస్సులు ఉదయం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రతి ఐదు నిమిషాలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకుని సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కొనసాగించాలని డీఎం ధరంసింగ్ కోరారు.

# కులగణన శాస్త్రీయంగా జరగాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

2027లో చేపట్టనున్న కులగణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించి, ఓబీసీ వర్గానికి స్పష్టమైన గుర్తింపు ఇవ్వాలని కోరారు. లేకపోతే కులగణనను వాయిదా వేయాలని, లేదంటే దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ తోటలో భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2027 జనగణనలో ప్రశ్న నెం.10ను సవరించి ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ కేటగిరీని స్పష్టంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఓపెన్ ఎండెడ్ విధానంలో కులాల నమోదు చేపడితే ఒకే కులం వివిధ పేర్లు, పర్యాయపదాలు, ప్రాంతీయ పేర్లు, ఉపకులాల పేర్లతో నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దీనివల్ల తుది గణాంకాల్లో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక ప్రామాణిక కోడ్ కేటాయించి, డిజిటల్ జనగణనలో డ్రాప్‌డౌన్ ఆధారిత కోడింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఎన్యూమరేటర్లకు ముందుగానే సాంకేతిక శిక్షణ ఇవ్వాలని కోరారు. కులగణనలో లోపాలు జరిగితే వాటి ప్రభావం దశాబ్దాల పాటు




– డాక్టర్ పరికిపండ్ల అశోక్

కొనసాగుతుందని, బీసీ సంఘాలు అప్రమత్తంగా ఉండాలని అశోక్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. బీసీ వర్గాల హక్కులు, ప్రాతినిధ్యం, సామాజిక న్యాయానికి కులగణన కీలకమని పేర్కొన్నారు.

## గణపతి లడ్డూను రూ.11,111కు కైవసం చేసుకున్న రిపోర్టర్ తాహేర్

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ నవయుగ గణేష్ మండలిలో కొలువుదీరిన గణనాథుడికి 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి గణేష్ నిమజ్జన శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం గణపతి లడ్డూ వేలం పాట నిర్వహించగా.. మండలంలోని అంబం(ఆర్) గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ తాహేర్ రూ.11,111కు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మండలి నిర్వాహకులు తాహేర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గణేష్ మండలి నిర్వాహకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**వేద న్యూస్, నర్సంపేట:**

– ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

– డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని కొనియాడారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అణగారిన వర్గాల హక్కులు, సమానత్వం కోసం ఐలమ్మ చూపిన తెగువ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరు రోజా రాణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహారాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు జూలూరు మనీష్ గౌడ్, అబోతు రాజు, సీనియర్ నాయకులు సుంకరి రవీందర్ రెడ్డి, బాల్నే జగన్, పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కందగట్ల నాగరాజు, కాసుల నాగేంద్రబాబు, ముత్యాల శ్రీనివాస్, చేను నరేష్, బానోతు రాజేందర్, చిలువేరు అన్వేష్, సామల ప్రవీణ్ కుమార్, ఆముదాల రమేష్, నూనె రంజిత్‌తో పాటు బీజేపీ శ్రేణులు, మహిళా మోర్చా, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

**వేద న్యూస్, రుద్రూర్:**



కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన కట్టు రాహుల్ (28) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూమ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు.

## దీర్ఘకాలిక సెలవులో రుద్రూర్ ఎంపీడీవో



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాల గంగాధర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. రుద్రూర్ గ్రామంలో నిర్మించిన 150 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ వ్యవహారంపై ఇటీవల పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. లబ్ధిదారుల జాబితా, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాల్లో ఎంపీడీవో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పలువురు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచన మేరకు బాల గంగాధర్ సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా, కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి రుద్రూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

## నేడు మెదక్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

– జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు

**వేద న్యూస్, పాపన్నపేట:**



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల పద్మశాలి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, యువజన సంఘాల నాయకులు, అభిమానులు ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పద్మశాలి సంఘానికి చెందిన కార్మికులు, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులు, సోదర సోదరీమణులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## పాపన్నపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**వేద న్యూస్, పాపన్నపేట:**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం పాపన్నపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల రజక సంఘం అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంపేట నరేందర్ గౌడ్, ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్, బీకొండ రాములు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, తెలంగాణ విముక్తి, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అన్యాయాన్ని ఎదిరించి ధైర్యంగా నిలిచిన ఐలమ్మ జీవితం మహిళలకు, నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు గోపాల్, పి. సుమన్, తాజా మాజీ సర్పంచ్ తిమ్మయగారి గురుమూర్తి గౌడ్, సుంకరి శివయ్య, ఎండీ గౌస్, పోతేదార్ మల్లన్న, లింగారెడ్డి, ఎండీ బాబర్ పటేల్, కుర్తివాడ ప్రసాద్ గౌడ్, కడారి ప్రభు, వెంకటేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో ఘనంగా అమ్మవారి పల్లకీ సేవ

**వేద న్యూస్, పాపన్నపేట:**





తెలంగాణలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగురంగుల విద్యుత్ కాంతులతో అలంకరించి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవను ఏడుపాయల పురమాడ వీధుల్లో వైభవంగా నిర్వహించారు. పల్లకీ సేవ సందర్భంగా ఏడుపాయల కొండలు, కోనలు దుర్గామాత నామస్మరణతో మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పల్లె సాయిబాబా, బ్రహ్మాచారి, దీపక్ రెడ్డి, నరేష్, మహేష్, యాదగిరి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## పైతర నర్సింలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, పాపన్నపేట:**



కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సీనియర్ నాయకుడు ఏడుపాయల శ్రీనివాస్ గౌడ్ తన సేవా భావాన్ని చాటుకున్నారు. పాపన్నపేట మండలం నాగసానిపల్లి గ్రామానికి చెందిన పైతర నర్సింలు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం తన వంతు సహాయంగా బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు శ్రీనివాస్ గౌడ్ అందిస్తున్న సహాయాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో సామెల్, చంద్రం గౌడ్, దావిద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం సెప్టెంబర్ 27, 2026

# పూసలపాడులో 2 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం



**వేద న్యూస్, నారాయణఖేడ్:**

నాగలగిద్ద సెక్షన్‌లోని 33/11 కేవీ పూసలపాడు ఉపకేంద్రానికి అనుసంధానించిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం విద్యుత్ గ్రిడ్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. ఎం/ఎస్ డాకాన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన ఈ కేంద్రం నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయనున్నారు. సౌర విద్యుత్ వినియోగంతో పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రోత్సాహం లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్థిరమైన విద్యుత్ ఉత్పత్తికి సౌర విద్యుత్ కేంద్రాలు కీలకమని పేర్కొన్నారు. గ్రిడ్ అనుసంధానానికి ముందు సాంకేతిక పరీక్షలు, భద్రతా ప్రమాణాలు, రక్షణ వ్యవస్థల తనిఖీలు పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించేందుకు మరిన్ని సౌర విద్యుత్ కేంద్రాలను గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# వరంగల్ యూజీడీ టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- ఎంఏయూడీ సెక్రటరీ, సీడీఎంఏ డాక్టర్ టీకే శ్రీదేవి**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ నగర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఏయూడీ సెక్రటరీ, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూజీడీ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పురోగతి, టెండర్ ప్రక్రియ, అర్బన్ చాలెంజ్ ఫండ్ నిధుల కోసం సమర్పించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. సాంకేతిక, పరిపాలనా ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి టెండర్లు చేపట్టాలని సూచించారు. యూజీడీ విస్తరణతో మురుగునీటి నిర్వహణ మెరుగుపడి నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రాజెక్టు అమలులో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమీక్షలో వరంగల్ బల్దియా కమిషనర్ టి. వెంకన్న, ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్



సాయపు రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ సహాయంపై ఓఎస్డీతో ఎమ్మెల్యే చర్చ

**వేద న్యూస్, హైదరాబాద్:**

సీఎంఆర్ఎఫ్ కింద ఎల్‌వోసీల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌ను కోరారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, అత్యవసర వైద్య అవసరాలున్న అర్హులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖరీదైన వైద్య చికిత్సలను భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఎల్‌వోసీ మంజూరు ప్రక్రియను మరింత సరళీకృతం చేసి వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో సాక్షి విలేకరి ఆదిమూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**వేద న్యూస్, గద్వాల:**

ఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లుల కేటాయింపుల్లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న విషయాన్ని రైతులకు తెలియజేయాలని



సూచించారు. కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ



**వేద న్యూస్, పెద్దపల్లి:**

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.యఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అణచివేత, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటికీ ప్రాసంగికమని తెలిపారు. ఆమె సేవలు, పోరాటాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎం. రవీందర్, రజక సంఘ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

**వేద న్యూస్, ఖమ్మం:**

వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా వైరా రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. భూమి, హక్కులు, గౌరవం కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె పాత్ర ఎంతో గొప్పదని, ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనా ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. మహిళలు సామాజిక మార్పుకు నాయకత్వం వహించగలరని ఐలమ్మ తన జీవితంతో నిరూపించారని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆమె చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్య



క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల భద్రతపై సమీక్ష

**వేద న్యూస్ శ్రీకాకుళం:**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళల భద్రత, రహదారి భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశాలపై విశాఖపట్నం పరిధి పోలీసు ప్రధాన అధికారి గోపీనాథ్ జట్టి సమగ్ర సమీక్ష నిర్వహించారు. దృశ్య మాధ్యమం ద్వారా జరిగిన ఈ సమావేశంలో





శ్రీకాకుళం జిల్లా పోలీసు అధికారి కె.వి. మహేశ్వర రెడ్డితో పాటు అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. పోలీసు శాఖలోని సిబ్బంది వివరాలు, సేవలకు సంబంధించిన సమాచారం మొత్తం వ్యవస్థలో సక్రమంగా నమోదు చేయాలని, పెండింగ్ అంశాలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు. మహిళలు, బాలలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, బాలికల అదృశ్యం, లైంగిక దాడులు, వరకట్న మరణాల వంటి ఘటనల్లో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల కారణాలను విశ్లేషించి తగిన భద్రతా చర్యలు అమలు చేయాలని, ప్రమాదం సృష్టించి పరారయ్యే వారిని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో త్వరగా గుర్తించాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై మరింత కఠిన నిఘా కొనసాగించాలని గోపీనాథ్ జట్టి ఆదేశించారు. గంజాయి సాగు, రవాణా, నిల్వ, విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అక్రమ ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలు, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి భద్రతా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

# అమరావతి క్రియేటివ్ ఎకానమీ యువతకు కొత్త అవకాశాలు

**వేద న్యూస్ మంగళగిరి :**

డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సుతో సృజనాత్మకతను అనుసంధానం చేసుకుని యువత కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో నిర్వహించిన అమరావతి క్రియేటివ్ ఎకానమీ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని యువతను ఉద్దేశించి మాట్లాడారు. సుమారు 300 మంది యువతీ యువకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కథా రచన, దర్శకత్వం, దృశ్య నిర్మాణం, దృశ్య ప్రభావాలు, యానిమేషన్ తదితర రంగాల్లో ఉన్న అవకాశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. సృజనాత్మక రంగాల్లో అభిరుచి ఉన్న యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని కలెక్టర్ సూచించారు. సాంకేతిక రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా డిజిటల్ వేదికలు, కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతలను వినియోగించుకోవడం ద్వారా యువత దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను పొందగలరని తెలిపారు. సృజనాత్మకతకు సాంకేతికతను జోడిస్తే అపారమైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అమరావతిని సృజనాత్మక పరిశ్రమలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. సృజనాత్మక ఆర్థిక



వ్యవస్థ అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక ప్రతిభకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని పేర్కొన్నారు. యువత తమ ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు.యువతలోని ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి కలయికతో భవిష్యత్‌లో కొత్త రంగాలు అభివృద్ధి చెందనున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు యువత ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073